క్లుప్తంగా

మాచవరం ఎస్ఐగా షమీర్ బాషా



మాచవరం: మాచవరం ఎస్ఐగా షమీర్ బాషా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ఎస్.కోటయ్య పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం బాషా మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, అందుకు మండల ప్రజలు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. చట్ట వ్యతిరేక చర్యల్ని ఉపేక్షించేది లేదని తెలిపారు. ఆయనకు పోలీసు సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

క్రెడిట్ క్యాంపుల్లో మహిళా రైతుల గుర్తింపు

కారెంపూడి: మండలంలోని చినగార్లపాడు, చినకొదమగుండ్ల, గాదెవారిపల్లె, కాచవరం, చినకొదమగుండ్ల, గాదెవారిపల్లె గ్రామాల్లో గురువారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో క్రెడిట్ క్యాంపులు నిర్వహించారు. సబ్సిడీపై పాడి గేదెలు అందించేందుకు అర్హులైన మహిళా రైతుల్ని గుర్తించారు. ఎంపీడీవో జి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మండల పశు వైద్యాధికారి పద్మావతి, వెలుగు,బ్యాంకు అధికారులు క్యాంపును నిర్వహించారు. శుక్రవారం కారెంపూడి, పేటసన్నెగండ్ల, చింతపల్లి గ్రామాల్లో క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

'డయల్ యువర్ డీఎం'కు ఐదు ఫిర్యాదులు

మాచర్ల: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11గంటల నుంచి 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ ప్రజల నుంచి ఐదు ఫిర్యాదులు అందినట్లు డీఎం ఆర్. పిచ్చయ్య తెలిపారు. కొందరు సలహాలు, సూచనలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి త్వరితగతిన కృషి చేస్తామని చెప్పారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



పిడుగురాళ్ల: బతుకుతెరువకు వచ్చి యువకుడు కానరాని లోకాలకు వెళ్లిన సంఘటన పట్టణంలోని రఘురాం రెస్టారెంట్ వద్ద చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని రఘురాం రెస్టారెంట్‌లో విద్యుత్ లైట్లు బిగించేందుకు పక్కనే ఉన్న భారత్ పెట్రోల్ బంకు నుంచి 12 అడుగుల స్టాండ్‌ను సప్‌లైయర్ ఏరువ సాయిరెడ్డి(26) తీసుకొని వస్తుండగా 11 కేవీ విద్యుత్ లైన్ వైర్లకు తగడంతో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా జరిగింది. సాయిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడిది ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం మద్దలకట్ట గ్రామం. రఘురాం రెస్టారెంట్‌లో సప్‌లెయర్‌గా పని చేస్తున్నాడు.

భక్తిశ్రద్ధలతో బోనాలు

మాచర్ల రూరల్: మండలంలోని కొత్తపల్లిలో పోలేరమ్మ, చౌడేశ్వరి అమ్మవార్లకు గురువారం పెద్దఎత్తున మహిళలు బోనాలు సమర్పించారు. కార్యక్రమాన్ని అర్చకులు ఇరువంటి సత్యనారాయణశాస్త్రి, గిరిశర్మ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి పద్మావతి, సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్ రెడ్డి, వైస్ ఎంపీపీ పోతురెడ్డి కోటిరెడ్డి, ఆరికట్ల పున్నారెడ్డి, గాలి బాలిరెడ్డి, దగ్గుల లచ్చిరెడ్డి, జయభారత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయాల ప్రతిష్ట

దుర్గి: మండల పరిధిలోని జంగమహేశ్వరపాడులో ఆలయాల ప్రతిష్ట మహోత్సవాల్ని గురువారం గణపతి పూజతో వైభవంగా ప్రారంభించారు. ప్రధాన అర్చకులు మంగళగిరి అనిల్‌శాస్త్రి ఆధ్వర్యంలో పోలేరమ్మ, ఆంజనేయ, పోతురాజు స్వాముల ధ్వజ స్తంభం సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఊరిబండి ఏగయ్య, ఊరిబండి రమేష్, ఊరిబండి మన్నయ్య, అంజయ్య పాల్గొన్నారు.

ప్రజల నమ్మకం... భరోసా జగనన్నే..

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- ప్రజలకు ఇచ్చిన హామీల్లో 95శాతం అమలు
- మళ్లీ జగనన్నే కావాలని కోరుకుంటున్న ప్రజలు



తంగెడలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : ప్రజల నమ్మకం..భరోసా జగనన్నే అని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తంగెడలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని పలు వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి, కరపత్రాలు అందించారు. ప్రజలు పలు సమస్యల్ని ఎమ్మెల్యే కాసు దృష్టికి తీసుకురావడంతో తక్షణమే పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ మళ్లీ సీఎంగా జగనే రావాలని ప్రజలంతా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారని తెలిపారు. సంక్షేమ పథకాల రథసారథి మళ్లీ అధికారం చేపడితేనే తాము ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి దిశగా పయనిస్తామని ప్రజలు ఆశపడుతున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో నూతన ఒరవడితో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనా సాగిస్తున్నారని, ఇటువంటి ప్రజారంజకమైన పరిపాలనా మునుపెన్నడూ ప్రజలు చూడలేదని ఆయన చెప్పారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలు చేస్తున్నామని వివరించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఇచ్చిన హామీలన్నింటిలో 95శాతం అమలు చేసి ప్రజల మన్నల్ని పొందగలిగామని ఎమ్మెల్యే కాసు తెలిపారు. కులాలు, మతాలు, రాజకీయ పార్టీలు చూడకుండా అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందించామని, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాలు ఆనందంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు, వృద్ధులు, చేనేత కార్మికులు, ఆటో కార్మికులు, లాయర్లు, డ్వాక్రా మహిళలు, రైతులు.. ఇలా అందరికీ అన్ని పథకాలు వర్తింప చేయడంతో జగన్‌పై ప్రజలకు నమ్మకం, విశ్వాసం పెరిగిందన్నారు. మళ్లీ జగనే సీఎం కావాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారని ఎమ్మెల్యే కాసు చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజల హృదయాల్లో సీఎం జగన్ చెరగని ముద్ర వేసుకున్నారని, ఆయన వచ్చే ఎన్నికల్లో గెలిచి సీఎం కావడం తథ్యమని ఎమ్మెల్యే కాసు ధీమా వ్యక్తం చేశారు. తంగెడలో 800మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని, త్వరలోనే ఇళ్లు మంజూరు చేయిస్తామని వెల్లడించారు. గతంలో ఏ ఎమ్మెల్యే కూడా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోలేదని తెలిపారు. సీఎం జగన్ నాయకత్వంలో తాము ఓట్ల కోసం కాకుండా చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి, సమస్యలు తెలుసుకునేందుకు ప్రతి గడపకు వెళ్లడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే కాసు చెప్పారు. శాసనసభ్యుడిగా గెలిచిన తాను ప్రజలకు సేవ చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో మరిన్ని పనులు చేసి ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. తంగెడ పరిసరాల్లో సిమెంటు ఫ్యాక్టరీలు ఉండటం వల్ల గ్రామంలో అభివృద్ధి పనులు మరింత శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ ఎంపీపీ కందుల జాను, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభాని, కోట కృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భూషణం చెన్నయ్య, సర్పంచులు దైద నాగరాజు, కొత్తపల్లి కాశయ్య, ఎంపీటీసీ సభ్యుడు పోతుల ప్రసన్నకుమార్, కో- ఆప్షన్ సభ్యుడు షేక్ హుస్సేన్, మాజీ సర్పంచులు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, పార్టీ కన్వీనర్ వీరాంజనేయులు, నాయకులు గొగిరెడ్డి వెంకటరెడ్డి, వట్టి రామచంద్రారెడ్డి, ఆరికట్ల మల్లారెడ్డి, దేవళ్ల వీరాస్వామి, బీరవల్లి శౌర్రెడ్డి, ఉప్పుతల యల్లయ్య, పాడి రామకోటయ్య, కాసర్ల నరసింహారెడ్డి, ఉప్పుతల నరసింహారావు, వట్టి చంద్రారెడ్డి, తండా సైదా, జానీ, బ్రహ్మారెడ్డి, మహ్మద్, నవీన్, దేవళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భూముల రీసర్వే పకడ్బందీగా చేయండి: జేసీ



రీసర్వే రికార్డులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్

దాచేపల్లి : భూముల రీసర్వే పకడ్బందీగా చేసి రికార్డులు తయారు చేయాలని జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని రామాపురంలో జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకం రీ సర్వేను గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో కలసి సచివాలయంలో సమీక్ష చేశారు. గ్రామంలో 2600 ఎకరాల్లో రీ సర్వే ముగిసిందని, అభ్యంతరాలు తెలిపేందుకు రైతులకు కూడా నోటీసులు ఇచ్చామని తహసీల్దార్ ఆర్. వెంకటేశ్వర్లు నాయక్ జేసీకి వివరించారు. రైతుల నుంచి అభ్యంతరాలు వస్తే పరిశీలన చేసి సమస్యలు పరిష్కరించాలని ఆయన అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో శంకర్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల్లో అనర్హులుంటే తొలగించండి

కారెంపూడి: పల్నాడు జేసీ ఎ. శ్యామ్ ప్రసాద్ కారెంపూడి మండలంలో గురువారం సాయంత్రం పర్యటించారు. ప్రభుత్వ పథకాల ప్రగతిని పరిశీలించారు. తొలుత ఒప్పిచర్ల గ్రామ సచివాలయం-2లో వైఎస్సార్, పీఎం కిసాన్ పథకం కింద లబ్ధి పొందుతున్న రైతుల జాబితాల్ని పరిశీలించారు. జాబితాలో 361 మంది రైతులు అనర్హులున్నారనే సమాచారం ఉందని, ఒకటి రెండుసార్లు పరిశీలించి అనర్హుల్ని తొలగించాలని జేసీ ఆదేశించారు. అనంతరం కారెంపూడిలో భూముల రీసర్వే పనుల్ని పరిశీలించారు. వివాదాలకు తావు లేకుండా సర్వే జరగాలని సిబ్బందికి సూచించారు. పెదకొదమగుండ్లలో జగనన్న పాలవెల్లువ పథకం పనితీరును పరిశీలించారు. గ్రామంలో పశు సంవర్ధక శాఖ నిర్వహిస్తున్న క్రెడిట్ క్యాంపును జేసీ తనిఖీ చేశారు.

రీ సర్వే వేగవంతం చేయాలి

రెంటచింతల: జగనన్న భూ హక్కు చట్టం రీ సర్వే పనులను వేగవంతం చేయాలని పల్నాడు జిల్లా సంయుక్త కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం వీఆర్‌ఓ, సర్వేయర్లతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. సెప్టెంబర్ 4 నుంచి మండల పరిధిలోని మిట్టగుడిపాడు, రెంటాల, పాలువాయి తదితర గ్రామాల్లో సర్వేను ప్రారంభించాలని ఆయన ఆదేశించారు.

సీసీ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే పీఆర్కే



జేసీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పీఆర్కే

విజయపురి సౌత్: మాచర్ల మండలం బెల్లంకొండవారి పాలెం నుంచి నాగులవరానికి రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం పరిశీలించారు. రోడ్డు మరమ్మతులకు గురై వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించి రూ. 20లక్షలు మంజూరు చేశారు. ఆయన వెంట ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా గొర్రెల పెంపకందారుల సంఘం చైర్మన్ బూడిద సైదులు, గొట్టిముక్కల ఏడుకొండలు ఉన్నారు.

మత్స్యకారులకు ప్రభుత్వం అండ

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- కృష్ణా నదిలోకి 15లక్షల చేప పిల్లల విడుదల



నదిలోకి చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పొందుగల గ్రామ సమీపంలోని కృష్ణానదిలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 16.85లక్షల చేప పిల్లల్ని గురువారం ఆయన వదిలిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం కొట్లాది రూపాయల్ని ఖర్చు చేస్తోందని తెలిపారు. ఏటా ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధి కల్పించే దిశగా పని చేస్తోందన్నారు. దేశ వ్యాప్తంగా చేపల ఉత్పత్తిలో ఏపీ ప్రథమ స్థానంలో ఉండగా, వినియోగంలో చివరి స్థానంలో ఉందని వెల్లడించారు. వినియోగం పెంచడంతో పాటు నాణ్యమైన చేపల్ని ప్రజలకు అందించేందుకు ఫిష్ ఆంధ్ర ద్వారా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు పెన్షన్ ఇచ్చి ఆదుకుందని వివరించారు. హార్బర్స్ నిర్మాణంతో పాటు జలాశయాల్లో చేప పిల్లల్ని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. జలశయాలల్లో లైసెన్స్ ఇచ్చి ఆక్వా రైతులకు అనుమతులు ఇస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కటకం జయశ్రీ , జెడ్పీటీసీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, మత్స్యశాఖ జిల్లా అధికారి ఎస్. సంజీవరావు, వ్యవసాయశాఖ అధికారి ఐ. మురళి, కలెక్టర్ ప్రతినిధి టి.ఎ.ఎ. శ్రీనివాసరావు, మత్స్యశాఖ సహాయ పర్యవేక్షకులు కాటూరి శివరామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సర్పంచ్ తండా బుడేసా, ఉప సర్పంచ్ షేక్ నన్నేసాహెబ్, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్ సత్తార్, మాజీ సర్పంచులు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభాని, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్, నగర పంచాయతీ మాజీ చైర్మన్ మునగా పున్నారావు, నాయకులు తండా అజీజ్, ముడి విక్టర్ పాల్, తండా హసన్‌వలి పాల్గొన్నారు.

భూగర్భ జలాల్ని కాపాడుకుందాం

మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: ప్రతి బొట్టూ వృథా కాకుండా భూగర్భ జలాల్ని కాపాడుకుందామని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం జరిగిన మున్సిపల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో భూగర్భ జలాల్ని జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలోనే పిడుగురాళ్ల పట్టణంలో ఉన్న చెరువు అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 11 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. ఇప్పటికే 30,31,32,1, 2, 3, 4, 6, 7, 11, 12, 13, 14 వార్డులకు తాగునీరు అందిస్తున్నామన్నారు. వచ్చే రెండు నెలల్లో 19,20,22, 23, 24, 27, 28, 29 వార్డులకు కూడా అందించనున్నట్లు చెప్పారు. మిగిలిన 8,9,10, 15, 16, 17, 18 వార్డుల్లో వాటర్ ట్యాంకులు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. పూర్తయితే ఆ వార్డులకు కూడా కృష్ణా జలాలు అందుతాయని చెప్పారు. దీంతో పట్టణంలో 90 శాతానికి పైగా కుళాయి కనెక్షన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కనెక్షన్లకు చెల్లించాల్సిన రుసుం కూడా తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలో బైపాస్ నిర్మాణం కూడా పూర్తి కావచ్చిందని, త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. జానపాడు రోడ్డులో రైల్వే బ్రిడ్జి టెండర్లు పూర్తయ్యాయని, మరో 20 రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. రూ. 52 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ అభివృద్ధి కోసం రూ. 19.33 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అధ్యక్షత వహించారు. ముందుగా మున్సిపల్ కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు అజెండాలోని అంశాల్ని చదివి వినిపించారు. వార్డుల్లో సమస్యల్ని కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఎండీ గఫార్, చింతా వెంకట రామారావు, షేక్ జైలాబ్దిన్, కొమ్ము ముక్కంటి పాల్గొన్నారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల: తక్కువ ధరతో నాణ్యమైన ఆహారం అందించడమే ఆహా క్యాంటీన్ల లక్ష్యమని పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని హైస్కూలు పక్కన మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు క్యాంటీన్ ఉంటుందని తెలియజేశారు. ఉదయం ఇడ్లీ, దోశ, గారె, పూరి, మధ్యాహ్నం రైస్‌తో భోజనం, సాయంత్రం స్నాక్స్, టిఫిన్ అమ్ముతారని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మకాలు ఉంటాయని చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఆహా క్యాంటీన్లు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, కౌన్సిలర్లు కత్తెరపు వాసుదేవరెడ్డి, మాదాల కిరణ్ కుమార్, అబ్దుల్లా, నాయకులు వెన్నా శ్రీనివాస్ రెడ్డి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతి పథంలో పయనిస్తున్న దాచేపల్లి

కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్

దాచేపల్లి : ప్రగతి పథంలో దాచేపల్లి నగర పంచాయతీ ముందుకెళ్తోందని చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ తెలపారు. సచివాలయం-1లో నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం గురువారం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులపై చర్చించి, ఆమోదం తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ సంద్రి మార్కెట్ వసూళ్లు నిలిపివేసేందుకు సభ్యులు తీర్మానం చేశారు. అనంతరం సమావేశంలో చైర్‌పర్సన్ సుబ్బమ్మ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో దాచేపల్లిని గ్రామ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేయించామని తెలిపారు. మౌలిక సదుపాయల కోసం కోట్లాది రూపాయల్ని కేటాయించినట్లు చెప్పారు. రూ.2.50కోట్లతో కొట్ల బజార్‌లో సిమెంట్ రోడ్డు నిర్మించామని పేర్కొన్నారు. ఇంటింటికీ తాగునీరు అందించేందుకు రూ.17కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. టెండర్ల ప్రక్రియ ముగింపు దశలో ఉందని, సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తి చేసి తాగునీరు ప్రజలకు అందిస్తామని చైర్‌పర్సన్ సుబ్బమ్మ చెప్పారు. కౌన్సిల్ సభ్యులు వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని ఆమె సూచించారు. కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్లు షేక్ మస్తాన్‌బీ, కొమెర బత్తిన అన్నపూర్ణ, కమిషనర్ వి. సత్యనారాయణ, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన నిర్మాణాల్ని పూర్తి చేయాలి

దుర్గి: గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాల్ని త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ డీఈ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని దుర్గి, పోలేపల్లి, ఆత్మకూరు, ఓబులేశునిపల్లె, కోలగుట్లలో నిర్మాణ దశలో ఉన్న సచివాలయాలు, ఆర్‌బీకె సెంటర్లను ఆయన పరిశీలించారు. అక్టోబర్ 2 నాటికి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని కాంట్రాక్టర్లను, ప్రజాప్రతినిధులకు తెలిపారు. ఆయన వెంట ఏఈ వెలుగొండారెడ్డి తదితరులున్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

విజయపురి సౌత్: విధుల్లో ఏ మాత్రం అలసత్వం వహించినా క్రమశిక్షణారాహిత్య చర్యలు తీసుకుంటామని శ్రీశైలం ఐటీడీఏ పీవో డాక్టర్ రవీంద్రారెడ్డి ఉపాధ్యాయుల్ని హెచ్చరించారు. స్థానిక పీటీజీ బాలుర పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, ఆవరణను చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల అకడమిక్ స్టాండెట్స్‌ను పెంచాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. డార్మెటరీలు, తరగతి గదులకు విండో మెష్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. పదో తరగతి విద్యార్థుల ఫలితాలు గత సంవత్సరం కన్నా మెరుగుపడాలని తెలిపారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జాన్సన్, వైస్ ప్రిన్సిపాల్ వి. రోహిణి, ఉపాధ్యాయులు బి. వెంకటేశ్వరావునాయక్, బొజ్జా వెంకటేశ్వర్లు, హనుమానాయక్, పీడీ రవి, పీఈటీ లింగయ్య, రామచంద్రరావు ఉన్నారు.

శ్రీ మాత అన్నపూర్ణేశ్వరికి లక్ష గాజులతో అలంకరణ

మాచర్ల: శ్రావణ శుక్రవారం, గురపౌర్ణమి పురస్కరించుకొని సొసైటీ కాలనీలో ఉన్న శ్రీమాతా అన్నపూర్ణేశ్వరీదేవిని గురువారం లక్ష గాజులతో శోభాయమానంగా అలంకరించారు. అమ్మవారికి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి దేవి సత్సంగ సేవా సమితి, శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి దేవి సేవా సమితిల ఆధ్వర్యంలో రెండు వేల మందికి అన్నదానం చేశారు.

కిడ్నాప్ అంటూ అపోహలు ప్రచారం : సీఐ

పిడుగురాళ్ల: టీడీపీ కార్యకర్తల్ని కిడ్నాప్ చేశామని అపోహలు సృష్టిస్తున్నారని, అది వాస్తవం కాదని పట్టణ సీఐ పి.వి.ఆంజనేయులు తెలియజేశారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ పిడుగురాళ్ల పట్టణంలోని అంజిరెడ్డి హాస్పిటల్ వద్ద 2021, 22 సంవత్సరాలలో అక్రమ ర్యాలీ, ధర్నాలో టీడీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేశామని తెలిపారు. దీనిపై 41 నోటీసులు ఇవ్వాలని వారికి పలుమార్లు చెప్పినా వారు స్పందించలేదని చెప్పారు. దీనికి సంబంధించి కొప్పుల నాగేశ్వరరావుకు 41 నోటీసు అందించి వెంటనే పంపిస్తామని తెలిపారు. అంతేకాకుండా అతడ్ని భార్యతో కూడా మాట్లాడించినట్లు చెప్పారు. ఈ కేసులో మరికొంత మందిని అరెస్టు చేసి, వారికి కూడా నోటీసులు అందించనున్నట్లు ఆయన తెలియజేశారు.

సందడిగా రక్షా బంధన్ వేడుకలు

మాచర్ల: పట్టణంలో రక్షా బంధన్ వేడుకల్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అక్కచెల్లెమ్మలు అన్నదమ్ములకు రాఖీలు కట్టి ఆశీస్సులు పొందారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, బాలురోన్నత పాఠశాల, గడియారం స్తంభం, ఎంపీపీ, ఎంపీయూపీ స్కూళ్ల హెచ్‌ఎంల ఆధ్వర్యంలో రాఖీ పండుగను నిర్వహించారు. పట్టణంలోని రామాటాకీస్ ప్రాంతంలోని నారాయణ స్కూలులో ప్రిన్సిపాల్ ఉల్లారెడ్డి ఆధ్వర్యంలో, కృష్ణవేణి స్కూలులో రామకృష్ణ, హెచ్‌ఎం హనుమంతరావు, చక్రధర్ డిగ్రీ కళాశాలలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, శ్రీహర్ష విద్యా సంస్థల్లో వెంకటరెడ్డి, కృష్ణవేణి కాలేజీలో ప్రిన్సిపాల్ వై. వెంకట్రామయ్య, ప్రతిభ, ఎస్‌వీఆర్, పల్నాడు కళాశాలల డైరెక్టర్లు పఠాన్ నాగూర్‌వలి, భాస్కర్, వెంకటనారాయణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వార్డు సచివాలయాల్లో ఉద్యోగులు తోటి మహిళలకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగాలకు 47 మంది ఎంపిక

పిడుగురాళ్ల: పట్టణంలోని జూనియర్ కళాశాలలో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళాలను నిర్వహించారు. ఐదు కంపెనీలు ముందుకు వచ్చాయి. మొత్తం 86 మంది హాజరు కాగా 47 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కె. సంజీవరావు తెలిపారు. కార్యక్రమంలో గవర్నమెంట్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.వి.కృష్ణారెడ్డి, కంపెనీ ప్రతినిధులు, యం. రవీంద్రనాయక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.